క్లుప్తంగా

వెంకటేష్‌ను కలిసిన మున్సిపల్ కమిషనర్



చీరాల టౌన్: చీరాల మున్సిపాలిటీ నూతన మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన విజయసారథి శనివారం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కరణం వెంకటేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈసందర్భంగా కరణం వెంకటేష్ మాట్లాడుతూ చీరాల మున్సిపాలిటీలో చేయాల్సిన అభివృద్ధి పనులు, సిటిజన్ చార్ట్, తదితర అంశాలపై కమిషనర్‌కు పలు సూచనలు చేశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యానికి అనుగుణంగా పని చేసి మున్సిపాలిటీని మోడల్ టౌన్‌గా తీర్చి దిద్దాలని సూచించారు.

రాతి ముఖమండప నిర్మాణానికి విరాళం

అద్దంకి రూరల్: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండలో నిర్మాణంలో ఉన్న ప్రసన్నాంజనేయస్వామి దేవస్థాన రాతి ముఖ మండప నిర్మాణానికి తురకపాలేనికి చెందిన పడిగపాటి అంజిరెడ్డి దంపతులు శనివారం రూ. 101116 విరాళాన్ని దేవస్థాన సహాయక కమిషనర్‌కు అందజేశారు.

ప్రజల వద్దకే పాలన తెచ్చిన సీఎం జగన్

అద్దంకి రూరల్: సచివాలయ వ్యవస్థ, వైఎస్సార్ గ్రామీణ ఆరోగ్య కేంద్రం, రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రజల వద్దకు పాలన తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త పానెం చినహనిమిరెడ్డి అన్నారు. శనివారం రాత్రి మండలంలోని నాగులపాడు గ్రామంలోని రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఉద్యోగులతో మాట్లాడారు. అనంతరం గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, మండలపార్టీ అధ్యక్షుడు గుజ్జుల జగన్‌మోహన్ రెడ్డి, స్థానిక నాయకులు అవిశెన ప్రభాకరరెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో విద్యకు అధిక ప్రాధాన్యత

సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం కరపత్రాన్ని ఆవిష్కరించారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న చిన హనిమిరెడ్డి

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన విద్యార్థులు 357 మందికి ముఖ్యమంత్రి బటన్‌నొక్కి నేరుగా రూ.45.53 కోట్లు నేరుగా వారి అకౌంట్‌లకు జమ చేయనున్నట్లు తెలిపారు. దీంతో పేద విద్యార్థులు కూడా విదేశీ విద్యను అభ్యసించటం జగనన్న పాలనలోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో అద్దంకి పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి , కోట శ్రీనివాసకుమార్, చిన్ని శ్రీమన్నారాయణ, ఉడత్తు సురేష్, శ్రీనివాసరావు, లక్ష్మణ పాల్గొన్నారు.

హనిమిరెడ్డిని కలిసిన రూరల్ సీఐ

సీఐగా బాధ్యతలు చేపట్టిన సీఐ శివరామకృష్ణారెడ్డి, కొరిశపాడు ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన శివయ్య శనివారం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



హనిమిరెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న న్యాయవాదులు

న్యాయవాదులతో ఆత్మీయ సమావేశం

అద్దంకిలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ న్యాయవాదులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా వచ్చిన న్యాయవాదులు తమ వృత్తిలో నిలదొక్కుకునే వరకు వారికి సహకారాన్ని అందిస్తున్న ముఖ్యమంత్రి ఒక్క జగన్ మోహన్‌రెడ్డేనన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నకు అండగా నిలవాలని న్యాయవాదులను కోరారు. అనంతరం హనిమిరెడ్డిని న్యాయవాదులు సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ న్యాయవిభాగం సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మార్టూరు: విధి నిర్వాహణలో ఉన్న నాయకులను అడ్డుకోవడమే కాక కారు డ్రైవర్‌పై దాడికి పాల్పడిన టీడీపీ నాయకులను తక్షణమే అరెస్టు చేయాలని మండల వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు. స్థానిక గ్రానైట్ ఫ్యాక్టరీలో కొన్ని రోజుల క్రితం తనిఖీల నిమిత్తం వచ్చిన మైనింగ్ అధికారులను టీడీపీ ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు, అతని అనుచరులు అడ్డుకొని కారు డ్రైవర్ శ్రీనివాస్‌పై దాడి చేసిన సంగతి తెలిసిందే. దాడిలో పోలీసులు అరెస్ట్ చేసిన ఆరుగురు నిందితులు మినహా మిగిలిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా పోలీస్ స్టేషన్‌లో అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ పఠాన్ కాలేషావలి, గర్నెపూడి రవిచంద్, బాబూనాయక్, రాజా నాయక్, మోషే నాయక్, గడ్డం మస్తాన్ వలి, అట్లూరి సుకుందరావు, బండి రామయ్య, మైలా చిననాగేశ్వరరావు, చిన్నవెంకటేశ్వర్లు, కొండ మస్తాన్, గొట్టిపాటి ప్రేమయ్య, తిరుపతి వెంకట విష్ణు పాల్గొన్నారు.

సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్

బల్లికురవ: ప్రభుత్వం గ్రామాల వారీగా జగనన్న కాలనీలో లబ్ధిదారులకు అందజేసిన నివేశన స్థలాలకు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నట్లు ఎంపీడీవో హనుమారెడ్డి శనివారం తెలిపారు. మండలంలోని 13 లేఅవుట్‌లలో 239 మందికి నివేశన స్థలాలు అందజేసినట్లు చెప్పారు. వీరిలో 116 మంది నిర్మాణ పనులు పూర్తి చేశారని మిగిలిన లబ్ధిదారులు కూడా నిర్మాణ పనులతో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చన్నారు. ఇంటి నిర్మాణం తోపాటు ఇంకుడు గుంతకు రూ.6 వేలు అందజేస్తున్నామని చెప్పారు. బల్లికురవ సచివాలయంలో జరిగిన రిజిస్ట్రేషన్‌లను వీఆర్‌వో మీనా, సెక్రటరీ బాజీ, పర్యవేక్షించారు.

క్రీడాకారులను అభినందించిన ఆమంచి

చినగంజాం: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో మండలంలోని కొత్తపాలెం సచివాలయం జట్టు ప్రథమ స్థానం సాధించింది. విజయం సాధించిన జట్టు శనివారం మాజీ ఎమ్మెల్యే, పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్‌ను కలిశారు. తాము గెలిచి సాధించి తీసుకొచ్చిన కప్‌ను ఆయన చేతుల మీదుగా జట్టు అందుకున్నారు. జట్టులోని క్రీడాకారులందరికీ ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఆడుదాం ఆంధ్రా కబడ్డీ పోటీలలో పాల్గొని విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు.



కొత్తపాలెం సచివాలయ కబడ్డీ జట్టును అభినందిస్తున్న ఆమంచి

విలువలతో కూడిన విద్యతో సమాజం అభివృద్ధి

చీరాల అర్బన్: విలువలతో కూడిన విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని చీరాల టూటౌన్ సీఐ జి.సోమశేఖర్ అన్నారు. శనివారం చీరాల రూరల్ పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీ ఆరో వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. మోడల్ స్కూల్‌లో విద్యతో పాటు విలువలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నేటి సమాజ అభివృద్ధికి ఇది చాలా అవసరమన్నారు. అనంతరం వివిధ అంశాలలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను మెడల్స్‌తో సత్కరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సరళకు , యలమంచిలి గ్రూప్ ఆఫ్ ఇనిట్యూషన్ నుంచి జగదీష్, పీఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక

వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 12 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు శనివారం తెలిపారు. అలింబిక్ ఫార్మసూటికల్స్ లిమిటెడ్ వారు నిర్వహించిన ఇంటర్వ్యూలకు ఎంబీఏ, ఫార్మసీ విద్యార్థులు 40 మంది హాజరయ్యారని తెలిపారు. వీరికి చివరిగా నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 12 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం వేణుగోపాలరావు, ప్రాంగణాల ఎంపిక అధికారి ఎస్ పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి తప్పనిసరి

కారంచేడు: గ్రామాల్లో చెత్త నిర్మూలను ప్రతి ఒక్కరు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎంపీడీఓ బీ బాబూరావు అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రం కారంచేడు మండల పరిషత్ సమావేశపు హాలులో స్వచ్ఛతపై అన్ని గ్రామాల కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఏర్పాటు చేసిన ఒక్క రోజు శిక్షణలో మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛ గ్రామాల కోసం ఆయా గ్రామాల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ప్రత్యేక కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఆర్ రమేష్‌బాబు, సూపరింటెండెంట్ పీ లక్ష్మీనారాయణ, సెర్ప్ సంస్థ కోఆర్డినేటర్ బీ అరుణ్ పాల్గొన్నారు.